ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- పేదరికం లేని రాష్ట్రాన్ని ఆవిష్కరించే కృషిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు.

- అవినీతికి తావులేని అభివృద్ధి భారతాన్ని నిర్మించడం కోసం యువత ముందుకు రావాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.

- తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు.

- రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

- రాష్ట్రంలో రేపటి నుంచి సంక్రాంతి వేడుకలు ప్రారంభం కానున్నాయి.

==================

తిరుపతి జిల్లా తిరుచానూరులో ఎజి అండ్ పి ప్రథమ్ – థింక్ పైపు లైన్ గ్యాస్ ను ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. వినియోగదారుడి ఇంట్లో స్టవ్ వెలిగించి ప్రారంభించిన ముఖ్యమంత్రి ఈ సందర్భంగా టీ ని స్వయంగా తయారు చేశారు. అనంతరం వినియోగదారుడిని అడిగి పైప్ లైన్ గ్యాస్ వివరాలను తెలుసుకున్నారు. పైప్ లైన్ గ్యాస్, సిలిండర్ గ్యాస్ మధ్య తేడా గురించి ఆయన లబ్దిదారుని నుండి వివరాలు అడిగారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

==================

పేదరికం లేని రాష్ట్రాన్ని ఆవిష్కరించే కృషిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. రాష్ట్ర ప్రజలకు ఆయన ఈరోజు సామాజిక మాధ్యమం ద్వారా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోందని వెల్లడించారు. పీ4 పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం విధానం అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. పీ4 విధానంలో భాగస్వాములు అవ్వాలని రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారికి ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పది సూత్రాలతో స్వర్ణాంధ్ర -2047 విజన్ ను ఇటీవల ఆవిష్కరించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

====================

అవినీతికి తావులేని అభివృద్ధి భారతాన్ని నిర్మించడం కోసం యువత ముందుకు రావాలని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈరోజు జరిగిన వివేకానంద జయంతి వేడుకలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్తమాన సమాజానికి స్వామి వివేకానందుని బోధనలు చాలా అవసరమని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివేకానందుని ఆలోచనలు, బోధనలు దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో తీసుకు వెళ్తున్నారని కేంద్ర మంత్రి అన్నారు.

====================

తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ నెల 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన ఒకరు మృతి చెందారు. కేంద్ర మాజీ మంత్రి, బోర్డు సభ్యురాలు అయిన పనబాక లక్ష్మీ టీటీడీ తరఫున 25 లక్షల రూపాయల చెక్కును మృతుని కుటుంబానికి అందచేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఈ ఘటన పట్ల వేగంగా స్పందించిందని అన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ బైట్..30 సెకన్లు)

====================

రాష్ట్ర ప్రభుత్వం గడచిన ఆరు నెలల కాలంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఈ రోజు సామాజిక మాధ్యమం ద్వారా వివరాలను వెల్లడించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 3,750 కిలో మీటర్ల సీసీ రోడ్లు వేసినట్లు చెప్పారు. కేవలం ఆరు నెలలోనే 22,500 మినీ గోకులాలు  నిర్మించినట్లు వెల్లడించారు. పీవీటీజీ ఆవాసాల కోసం రూ.750 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రాష్ట్రంలో అనేక ఇతర అభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రభుత్వం చేపట్టిందని ఆయన గుర్తు చేశారు.

==================

విరామం

==================

రాష్ట్రానికి సంక్రాంతి కళ వచ్చింది. రేపటి నుండి భోగీతో మొదలై మకర సంక్రాంతి, కనుమ పండుగలు వరసగా వస్తున్నాయి. ప్రజలు ఉత్సాహంగా ఈ వేడుకలను జరుపుకునేందుకు సమాయత్తమవుతున్నారు. సదూర ప్రాంతాల నుంచి సొంత ఊళ్ళకు చేరుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో విశాఖపట్నం, విజయవాడ నగరాలతో పాటు, వివిధ పట్టణాల్లోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి.  ప్రత్యేక రైళ్లు, బస్సులు చాలని పరిస్థితులలో ఫిట్‌నెస్ బాగా ఉన్న ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల బస్సులను కూడా వినియోగించుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించినట్లుగా అధికారులు  తెలిపారు. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి కూడా డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఈరోజు ఉదయం నుండే హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ ప్రారంభమైంది. టోల్‌గేట్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ రద్దీని అదుపు చేసేందుకు స్థానిక పోలీసు యంత్రాంగం ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తోంది.

====================

విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల సంఖ్యను రేపటి నుంచి పెంచుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ప్రస్తుతం ఈ ఎక్స్‌ప్రెస్‌లలో కోచ్‌ల సంఖ్య 8 ఉండగా 16కు పెంచుతున్నట్లు ప్రకటించారు. అలాగే, సీట్ల సంఖ్య 530 నుంచి 1,128 కు పెరుగనుందని వివరించారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ కోచ్ 1, చైర్‌కార్ కోచ్‌లు 7 ఉండగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు 2, చైర్‌కార్ కోచ్‌లు 14కు పెరుగుతాయని జీఎం వివరించారు.

====================

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించి పేదలకు లక్షలాది రూపాయలను వైద్య సహాయంగా అందిస్తోందని జలవనరుల శాఖా మంత్రి  నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 60 లక్షల రూపాయల చెక్కులను లబ్దిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.

=====================

రాష్ట్రంలో దక్షిణ కోస్తా రాయలసీమ జిల్లాలలో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆ వివరాలను వాతావరణ అధికారి తెలియచేస్తూ..

(వాయిస్ బైట్..22 సెకన్లు)

=====================

తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తిరుమల తిరుపతి దేవస్థానం (TTD) బోర్డు సభ్యులు ఈ రోజు చెక్కులను పంపిణీ చేశారు. విశాఖపట్టణంలో  ఉన్న మృతుల కుటుంబాల ఇళ్ళకు వెళ్ళి  టీటీడీ తరఫున 25 లక్షల రూపాయలు, బోర్డు సభ్యుల తరఫున రూ. 2 లక్షల 50 వేల రూపాయల చెక్కులను అందించారు. మృతుల కుటుంబంలో ఒక వ్యక్తికి  టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం, చదువుకుసే పిల్లలు ఉంటే వారి పిల్లలకు సహకారం అందిస్తామని టీటీడీ సభ్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ శాసనసభ్యుడు పి.విష్ణు కుమార్ రాజు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించారు.

=====================

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా అనంతపురం జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ కోరారు. జిల్లాలోని బెలుగుప్ప మండలం అంకంపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన మినీ గోకులం షెడ్లును ఆయన ఈ రోజు ప్రారంభించారు.

=====================
=====================